# ముసురు

తన తల్లి చెప్పినమాటలు వింటే గుండెలు బద్దలైనంత పనైంది సరోజినికి—

"ప్రసాద్‌కి నిన్ను చేసుకోవటం ఇష్టం లేదుట—మనను మరో సంబంధం చూసుకో మంటున్నారు—పోనీలే! మరీ మంచిది. ఈ మాత్రం సంబంధం దొరక్కపోతుందా?"

చాలా నిర్లిప్తంగా చెప్పింది అమ్మ.

పెద్దవాళ్ల లెక్కల ప్రకారం "ఆమాత్రం సంబంధం" దొరుకుతుందో దొరకదో తెలియదు కానీ, ప్రసాద్ మాత్రం తనకు దొరకడు. లోకంలో ప్రసాద్ ఒక్కడే ఉన్నాడు. అతడే తనకు కావాలి.

విధి బలీయమనడానికి కింతకంటె నిదర్శనమేం కావాలి? ఇంతకు సరిగ్గా నెల రోజుల క్రిందట తనకంటే అదృష్టవంతురాలు లేదని మురిసిపోయింది.

ప్రసాద్‌లాంటి వ్యక్తితో తన పెళ్ళి నిశ్చయం కావటం అదృష్టం కాక మరేమిటి?

ఆ రోజు తను మల్లెపందిరి క్రింద నిల్చుని ఏదో పరాకుగా ఆలో చిస్తూంటే పిల్లిలా వెనకాలే వచ్చి నిల్చుని పెద్ద మర్యాదస్తుడిలా"కొంచెం దారి ఇస్తారా?'' అని వినయంగా అడిగి తను ఉలిక్కిపడి పక్కకు తప్పుకోగానే కొంటెగా నవ్వి తన జడలో మల్లెలు కొన్ని తుంపుకుని ఏమీ ఎరుగని వాడిలా తలవంచుకొని పోయే ప్రసాద్‌మూర్తి జన్మలో మరువ గలదా?

ఎంతో సంతోషంగా అన్నాడు—"ఇక నువ్వు నాదానివి కావటా నికి ఎన్నో రోజులు పట్టదుపరూ! నీకు సంతోషమే కదూ!"—అని.

తను సిగ్గుతో ముడుచుకుపోయింది. అసలు తనకు సిగ్గు పడటమంటే చిరాకు. కానీ, అదేమిటో ప్రసాద్‌ముందు నిలబడేసరికి లోకంలోని సిగ్గంతా తననే వరించినట్లు తోస్తుంది.

"ఈ సిగ్గులరాణి 'ఆనాడు' ఏం చేస్తుందో చూస్తా!" కొంటెగా వాలిన తన కళ్ళల్లో చూస్తూ అన్నాడు. తనకు శరీరమంతా గగుర్పొడి చింది. "ఛీ! పాడు మాటలు!" అని అక్కడ నిలువలేక లోపలకు పరుగెట్టింది.

ఎంతలో ఎంత మార్పు!

పొద్దుట నవ్వుతూ కలకలలాడుతూ ఇంటినుండి బయలుదేరిన ప్రసాద్ తిన్నగా ఇల్లుచేరక ఆస్పత్రి చేరవలసి వచ్చింది. అతనెక్కిన సైకిలు కారుకు గుద్దుకుంది. ప్రమాదకరమైన గాయాలే తగిలాయి. ప్రాణాలతో బయట పడ్డాడు. కాని, కళ్ళుమాత్రం పోగొట్టుకున్నాడు.

ఒక కన్నుతోపాటు అతనిలోని ఉత్సాహమూ, చైతన్యమూ, చిలిపితనమూ అన్నీ నశించి పోయాయి.

ఏడ్చి ఏడ్చి సరోజినికి కళ్లు వాచిపోయాయి. ఒకసారి ప్రసాద్ దగ్గరకు వెళ్లి మాట్లాడితే? గుండె స్పందనం హెచ్చింది. అమ్మయ్యో! ఆడదానికింత సాహసమా? అనిపించింది. అయినా ఇది సామాన్య విషయం కాదు. జీవితానికంతకూ సంబంధించినది.

అప్పుడంత అనురాగం చూపి తనను మరపించిన ప్రసాద్ ఇప్పుడిలా అనడానికి కారణమేమయి ఉంటుంది?

సరోజిని ఆలోచించలేకపోయింది. లేనిపోని అనుమానాలతో తనను తాను నాశనం చేసుకునే దానికంటే ప్రసాద్‌తో స్పష్టంగా మాట్లాడటమే మంచిదని తోచింది.

రోజూ సాయంత్రం ప్రసాద్ స్టేట్ లైబ్రరీకి వస్తాడని సరోజినికి తెలుసు. అక్కడే అతనిని కలుసుకోవాలని నిర్ణయించుకుంది.

తెరిచిపెట్టిన పుస్తకంలో చేతులాన్చి శూన్యంలోకి చూస్తున్న ప్రసాద్, "ప్రసాద్ అన్న సరోజిని గొంతు వినగానే ఉలికిపడి క్రింద ఉంచిన 'గాగుల్స్' వెంటనే కళ్ళకు తగిలించుకుని పేలవమైన చిరునవ్వుతో సరోజినిని 'విష్' చేశాడు.

కూర్చున్నదేగాని సరోజిని తల ఎత్తలేక పోయింది. ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో అంతకంటె తోచలేదు.

కొన్ని క్షణాలు అలా నిశ్శబ్దంలో దొర్లిపోయాయి. ఆ నిశ్శబ్దాన్ని భరించలేక ప్రసాద్—"ఏం పుస్తకాలు కావాలి?" అన్నాడు.

సరోజినికి లోలోపల చాల బాధ తోచింది. తను ఎందుకొచ్చిందీ నిజంగా ప్రసాద్‌కు తెలియదా? ఎలానో గొంతు పెగుల్చుకొని "నేను పుస్తకాలకోసం రాలేదు"—అంది.

ఎందుకొచ్చావని ప్రసాద్ అడగలేదు. సరోజిని కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి.

లేచిపోదామనుకుంది కానీ, అర్థంలేని అభిమానానికి, తన అనురాగాన్ని బలిపెట్టుకోలేక — "నిన్న నాకు అమ్మచెపుతే నమ్మలేక పోయాను" అంది మెల్లిగా.

ప్రసాద్ మాట్లాడలేదు. సరోజిని ధైర్యంచేసి తలఎత్తింది. నల్లని 'గాగుల్స్' వెనుకదాగున్న అతని కళ్ళలో ఏ భావమూ ఆమె చదవలేక పోయింది.

క్షణక్షణానికీ లజ్జతో ఆమె కృంగిపోతూంది. తన స్త్రీత్వాని కింతకంటె అవమానముండదు. పొంగి పొర్లుకొస్తున్న కన్నీళ్ళను అతి ప్రయత్నంమీద అణచుకుంటూ "మన పెళ్లి విషయంలో వెనుకటి నిర్ణయ మెందుకు మారిందో తెలుసుకుందామని...." అంది.

అతను పొడిగా — "అన్నింటికీ కారణా లేముంటాయి?" అన్నాడు.

అతని పురుషహృదయమూ, ఆత్మాభిమానమూ—"నేను కన్ను లేని వాడిని. అందుకని నీకు తగనేమోనని నా నిర్ణయం మార్చుకు న్నాను." అని అననీయలేక పోయాయి.

సరోజిని ఇంక భరించలేకపోయింది. బల్లమీద తల ఆన్చి అంత వరకూ అణచివుంచిన కన్నీటిని స్వేచ్ఛగా ప్రవహింపజేస్తూ "కానీ.... కానీ.... నువ్వు లేకుండా నేను బ్రతకలేనని నీకు తెలుసు ప్రసాద్!" అంది.

ప్రసాద్ తన కన్నీరు ఆమెకు కనబడకుండా ముఖం ప్రక్కకు తిప్పుకుని "తెలిసీ తెలియని నిర్ణయం నీది. అన్నీ తెలిసిన నిర్ణయం నాది. జాగ్రత్తగా ఆలోచించు" అన్నాడు.

"నాది తెలిసీ తెలియని నిర్ణయం కాదు. ఆలోచించకుండా అనటం లేదు. నన్ను అన్యాయం చెయ్యకు ప్రసాద్!" వెక్కుతూ అంది సరోజిని.

ప్రసాద్ కాసేపటివరకూ ఏమీ మాట్లాడలేకపోయాడు. చివరకు గాద్గదిక స్వరంతో "నువ్వంత స్థిరంగా నిశ్చయించుకుంటే నేనుమాత్రం నిన్ను వదులుకోగలనా సరూ!" అన్నాడు.

సరోజిని ముఖం వికసించింది.

ఇన్ని మాటలు తెగించి ప్రసాద్‌తో మాట్లాడటం ఇదే మొదటి సారి. ఈ విషయం తలుచుకోగానే సిగ్గుతో కందిపోయింది. కానీ, తను సాధించిన విజయాని కమితమైన సంతోషమూ కలిగింది.

"నేనింక వెళ్ళిరానా?" అంది ఎంతో మృదువుగా.

"ఊ!" అన్నాడు తలవంచుకునే.

"ఇంకా కాసేపు ఉండు" అని అననందుకూ, వెనకటిలా తన బుగ్గ మెలిపెట్టనందుకూ సరోజిని చిన్నబుచ్చుకుంది. ఏదో వెలితితో లేచి బయలుదేరింది.

పెళ్ళయిన పది రోజులలోనే సరోజిని సంతోషమంతా మంచులా కరిగిపోయింది. తను ఏ ప్రసాద్ కోసం కలవరించి తపించిపో యిందో ఆ ప్రసాద్, ఈ ప్రసాద్ ఒకటికాదు.

అనుక్షణమూ, ఒకళ్ళ నొకళ్ళు కవ్వించుకుంటూ చిలిపిగా, దెబ్బలాడుకుంటూ, సరదాగా నవ్వుకుంటూ గడపాలని గంపెడాశతో వచ్చిన సరోజినికి ముభావంగా, గంభీరంగా, ఏదీ పట్టనట్లుగా, ఏమీ అక్కర్లేనట్లుగా ఉండే ప్రసాద్ ప్రవర్తన తీరని ఆశాభంగం కలిగించింది.

రోజు రోజుకూ తనకూ ప్రసాద్‌కూ మధ్య ఏదో దూరం పెరుగుతున్నట్లు బాధపడ సాగింది సరోజిని.

కొన్ని రోజులు సిగ్గుతో మొహమాటంతో ఏమీ మాట్లాడలేక పోయేది. కానీ క్రమంగా ఈ నీరసతను భరించలేక తనే ప్రసాద్‌ను కవ్వించడం మొదలుపెట్టింది.

ప్రసాద్ అన్నిటికీ నిర్వికారంగా ఊరుకునేవాడు. తెల్లవారి లేస్తే సరోజిని లేవదీసే గిల్లికజ్జాల కన్నిటికీ ప్రసాద్ దగ్గర్నుంచి మౌనమే సమాధానం.

ప్రసాద్‌కు కోపంరాదు, సంతోషంరాదు. అతను విసుక్కోడు ఉల్లాసపడడు.

సరోజిని విసిగిపోయింది. తిట్టితే పడవచ్చు, కొట్టినా ఫరవాలేదు. పోనీ నాలుగు తన్నితే హాయిగా ఏడవవన్నా ఏడవవచ్చు నలుగురూ ఓదారుస్తారు. కానీ, ఈ గాంభీర్యంతో మౌనంతో ఎలా వేగటం?

రాను రాను సరోజినికోనూ ఉత్సాహం తగ్గిపోసాగింది. ఆశాభంగంవల్ల ఉడుకుమోత్తనమూ, తను అర్థంచేసుకోలేని ప్రసాద్ ప్రవర్తనవల్ల ఒక రకమైన కసీ ఆమెలో రోజురోజుకూ పెరగసాగాయి.

తనకు తెలియకుండానే సూటీపోటీ మాటలతో ప్రసాద్ మనసు గాయపరచటం మొదలుపెట్టింది. ఆమెఅలా మాట్లాడినప్పుడల్లా ప్రసాద్ తల ఎత్తి ఒకసారి ఆమె ముఖంలోకి నిశితంగా చూచి తలవంచుకుని వెళ్ళిపోయేవాడు.

సరోజిని విలవిలలాడిపోయేది. తన మాటల వల్ల ప్రసాద్ మనసుకెంత వ్యథ కలుగు తుందో అంతకు పదిరెట్లు వ్యథ ఆమె కూడా అనుభవించేది.

పెళ్ళయి సంవత్సరం గిర్రున తిరిగింది. ఆ రోజు నిద్రనుండి లేస్తూనే సరోజినికి మొదటగా ఆ విషయమే గుర్తుకు వచ్చింది. ఈ సంవత్సరం కాలంలోనూ జరిగిన మార్పులకు ఆమె బాధపడింది.

తన ప్రక్కనే ప్రశాంతంగా నిద్రపోతున్న ప్రసాద్‌ను చూసే సరికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 'అనవసరంగా దేవతలాంటి ఈయన మనసు నొప్పిస్తున్నాను. పాపిష్టిదానిని' అని తనను తాను తిట్టుకుంది. వంగి మెల్లగా అతనికి మెలకువ రాకుండా నుదుటిమీది ముంగురులు వెనక్కు తోసి నుదురు ముద్దుపెట్టుకుంది.

ఆమెలో మళ్ళీ వెనుకటి ప్రేమంతా పొంగింది. "ఎంత తియ్యగా గడపవలసిన రోజులు! నేనే నరకం చేస్తున్నాను" అనుకుని ఆ రోజు నుండీ తమ జీవితాలను తనకు సాధ్యమైనంత సంతోషంగా చేయాలని నిశ్చయించుకుంది.

తలంటి పోసుకుని కొత్తచీర కట్టుకుంటూంటే తనకోసం ఈ రోజు ప్రసాద్ ఏమీ తేలేదన్న భావన మనస్సుకు ముల్లులా గుచ్చు కుంది.

ఏమీ అక్కర్లేదు. ఒక్క గులాబీ తీసుకువచ్చి "సరూ నీకోసం!" అంటే తనెంత పొంగిపోయేది.

సరోజినికి చటుక్కున కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పొద్దున్నే తను చేసుకున్న నిర్ణయం గుర్తుకు వచ్చి వెంటనే కళ్ళు తుడుచుకుని—

"ఆయన కిట్టాంటివన్నీ పట్టవు. కొంతమంది అంతే" అనుకుని సరిపెట్టుకుంది. తీరుబడిగా అరగంటసేపు అలంకరించుకొని ఫలహారపు పళ్ళెంతోసహా ప్రసాద్ దగ్గరికి వచ్చింది.

ప్రసాద్ కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకంలో లీనమయి ఉన్నాడు.

స్వతహాగా చిలిపిదైన సరోజినికి అకస్మాత్తుగా ఒక చిలిపి ఊహ తట్టింది. ప్రసాద్ కళ్ళు మూయాలని. ఊహ వచ్చిందే తడవుగా చప్పుడు చేయకుండా వెనకాలే వెళ్ళి ప్రసాద్ కళ్ళమీద చేతులుంచింది.

ఆ ప్రయత్నంలో 'గాగుల్సు' జారి క్రింద పడ్డాయి. ముక్కలయ్యాయి.

క్షణమైనా విడవకుండా 'గాగుల్స్' ధరించే ప్రసాద్ తన గాగుల్స్' బ్రద్దలు కాగానే రుద్రుడయ్యాడు.

"సరూ" గర్జించాడు.

సరోజిని వణికిపోయింది. ఆమెకు నోటమాట రాలేదు. ప్రసాద్ కోపంతో వణికిపోతున్నాడు.

"ఎందుకు నీకింత అహంకారం? ఎందుకా మిడిసిపాటు? అంత వళ్ళుపై తెలియటంలేదా? అసలు నువ్వు ఆడదానివన్నమాట మరచిపోతున్నావు? ఛీ"

చీదరించుకున్నాడు.

ఆ చీదరింపు సరోజిని హృదయానికి చురుక్కున తగిలింది. తని ప్పుడేమంత మహాపరాధం చేసిందని ఇన్ని మాటలనడానికి? తనకు అహంకారమా? మిడిసిపాటా?

రోషంతో సరోజిని వణికిపోయింది.

"ఏంచేశాను నేను ఆమాత్రం పొరబాటు ఎవరికైనా జరుగదా! వాడుగాదు! నీకు— మొగవాడినని అహంకారం! నాకేం తక్కువని నన్నింత అవమానించటం?"

ఈ చివరి మాటలు సరోజిని యథాలాపంగా అన్నా ప్రసాద్‌కు ఎక్కడ తగలాలో అక్కడ తగిలాయి. క్షణంలో అతని ముఖం వివర్ణ మయింది.

"అవును నీకేం తక్కువలేదు. నాకే ఒక కన్ను తక్కువ. నీ అహంకారమంతా అదే. నాకు తెలుసు!"

ఈ మాటలతో అసలే ఉడికిపోతున్న సరోజిని పూర్తిగా రెచ్చి పోయింది. తనేంమాట్లాడుతుందో తనకు తెలియకుండా అరిచింది.

"నీకు బాగా తెలుసు. నే నెప్పుడన్నా ఆమాట అన్నానా? నీకు ఒక కన్ను తక్కువయినా నిన్నే చేసుకున్నానే! నీ లోటును నా మనస్సు లోనే అణచుకుని నిన్ను మనసారా అభిమానిస్తున్నానే?" ప్రసాద్ మన స్సులో జ్వాలలు లేచాయి.

"ఓహో! స్వార్థ త్యాగినీ! ఎవరుచెయ్యమన్నారు నిన్నింత త్యాగం? నీ జాలీ, దయా ధర్మాలూ ఎవరు కోరారు? సుఖంగా ఉన్న నా జీవి తంలో కావాలని ఎవరు ప్రవేశించమన్నారు? నువ్వు సృష్టించిన వర

కానికి ప్రతిఫల మియ్యగలిగే శక్తి నాకు లేనిమాట నిజమే. ఇందులోనుంచి విముక్తి ఎప్పుడో తెలియటంలేదు."

సరోజిని మనసు ముక్కలు ముక్కలయింది.

"విముక్తా? నేనూ అదే కోరుకుంటున్నాను. నేను దిక్కులేని దాన్ని కాను. నన్ను ఆదరించి అభిమానించే తల్లితండ్రు లున్నారు. భర్త ప్రేమకు నోచుకోని దాన్నయినా, తల్లిదండ్రుల అనురాగాన్ని పొందగ లను."

"నాకేం అభ్యంతరం లేదు."

"థ్యాంక్స్, ఇవాళ సాయంత్రమే బయలుదేరుతున్నాను."

ప్రసాద్ మాట్లాడకుండా బయటకు వెళ్ళిపోయాడు.

సరోజిని పరుపుమీద వాలి దిండుల్లో తల దూర్చి గుండెలబరువు కరిగిపోయేలాగ ఏడిచింది.

బయటకు నడచిన ప్రసాద్ ఒకస్సారి జరిగినదంతా సింహావలో కనం చేసుకున్నాడు. 'కాస్త తొందర పడ్డానా?' అనుకున్నాడు. అయినా సరోజిని అహంకారం తలుచుకునేసరికి, అతనికి కోపం అగ్గల మైంది. "అనుభవించనీ! తర్వాత పశ్చాత్తాప పడుతుంది." అనుకు న్నాడు.

సరోజిని ఏమైనా మనసు మార్చుకుంటే తనుకూడా ఫర్వకుండా మనుకున్న ప్రసాద్ ఇంటికి వచ్చి సామాను సర్దుకుని సిద్ధంగా ఉన్న సరోజినిని చూచి తన మనస్సు మరింత గట్టిచేసుకున్నాడు. ఎర్రగా వాచివున్న ఆ కళ్లు ఉబ్బిన ఆమె ముఖమూ, అతనిల్లో జాలి కలిగించక పోలేదు. అయినా నిగ్రహించుకున్నాడు.

సరోజినికి దుఃఖం పొంగుకు వస్తూవుంది. ఎంత అణుచుకున్నా, అణగకుండా కళ్ళలో నీళ్లు తిరుగుతునే ఉన్నాయి.

ప్రసాద్ నోటి వెంబడి ఒక్క అనునయ వాక్యము, చిన్న ఓదార్పు మాట వచ్చినా, తన ప్రయాణం మానుకుని ఉండేది. అన్ని మాటలు పడీ తన తప్పేమీ లేకపోయినా మళ్ళీ తనే అతనికి లొంగి పోవడానికి మనసు ఒప్పుకోలేదు.

కన్నీటి తెరలు అడ్డు రావటం వలన బయలు దేరేముందు ప్రసాద్ ముఖమైనా సరిగ్గా చూడలేక పోయింది. ప్రసాద్ వంచిన తల పైకెత్తలేదు.

తన కెంతమాత్రమూ ఇష్టము లేకిపోయినా సరోజిని తల్లిగా రింటికి చేరింది. ప్రతిరోజూ పోస్టువాడి కోసరం ఆశగా ఎదురుచూసేది. రోజులూ, వారాలూ, నెలలూ గడిచిపోతున్నాయి

వెనుకటి ఉత్సాహమూ, చైతన్యమూ నశించి, క్రమంగా నిర్జీవంగా తయారయింది.

అకస్మాత్తుగా సరోజినికి పిడుగులాంటి వార్త వినిపించింది— ప్రసాద్ ప్రాణాపాయానికికూడా తెగించి కంటిఆపరేషన్‌కు సిద్ధపడాడని.

ఈ వార్త వినగానే ఆమె అభిమానమూ, రోషమూ అన్నీ కరిగి పోయాయి. పశ్చాత్తాపంతోనూ, ఆర్తితోనూ కదిలిపోయింది.

"నిండుమనిషివి ఇప్పుడే ప్రయాణమెందుకు? వద్దం" టున్నా వినకుండా బయలుదేరింది.

తన శరీరాన్ని తను లెక్కచేయకుండా ప్రాణాలన్నీ ప్రసాద్ మీద ఉంచుకొని సేవచేసింది.

ప్రసాద్‌కు స్మృతివచ్చి కళ్ళు తెరవగానే చెయ్యిమీద తలఆన్చి కూర్చున్న సరోజిని కనిపించింది.

అతని మనస్సులో వెంటనే ఏదో ఒక అనిర్వచనీయమైన ఉద్వేగం చెలరేగింది. "ఏం? నా కన్ను వచ్చిందని తెలిసి వచ్చావా?" నీరసంతో కృశించివున్న సరోజిని ఈ మాటలతో శిల అయింది.

"కాదు-ఇక్కడి డాక్టర్లనడిగి నా రెండుకిళ్ళూ పీకించుకుందామని." అని నిర్జీవంగా నడిచి అక్కడనుండి లేచిపోయింది.

లేచి నడుస్తున్న సరోజిని కడుపుమీద ప్రసాద్ దృష్టి పడేసరికి అతని హృదయమంతా సంతోషంతో నిండిపోయింది.

సరోజిని తనకీ విషయం చెప్పకుండా దాచింది.

పరాకుగా వున్న ప్రసాద్ "మిస్టర్" అన్న నర్సు పిలుపు విని ఉలిక్కిపడి అటు తిరిగాడు.

నర్సు కాసేపు తటపటాయించి—"మీ వ్యక్తిగత విషయాల్లో కలుగజేసుకుంటున్నందుకు క్షమించండి. ఆవిడ దగ్గర దగ్గర వారం రోజులనుండి మీరు స్మృతిలేకుండా ఉన్నప్పుడు నిద్రాహారాలు లేకుండా మీ మంచందగ్గర పడిగాపులు పడివుంది. స్మృతి వచ్చీరాగానే మీ రామెనలా నొప్పించారు. మీ వ్యక్తిగత కలహాలెలావున్నా, విందుమనిషి కనుక కనీసం ఆమె ఆరోగ్యం దృష్ట్యా అయినా మీ రలా ప్రవర్తించడం భావ్యంకాదు, క్షమించండి"-అనేసి అక్కడనుండి వెళ్ళిపోయింది.

ఒక నర్స్‌చేత అలా చెప్పించుకోవలసి వచ్చినందుకు చాలా సిగ్గుపడ్డాడు.

"కనీసం ఆమె ఆరోగ్యం దృష్ట్యా అయినా" అని నర్స్ అన్న మాటలు పదేపదే అతని చెవులలో గింగురుమంటున్నాయి. చాలా రోజులకు అతని మనసంతా ఒక విధమైన ఉల్లాసంతో నిండిపోయింది.

చాలాసేపటి తరువాత తన దగ్గరకు వచ్చి తల వంచుకొని తనకు మందుగ్లాసందించిన సరోజినిని చూడగానే అతని మనసంతా ఆమెమీద అనురాగంతోనూ, జాలితోనూ ఆర్ద్రమయింది.

మందుతోపాటు ఆమె చేతినికూడా పట్టుకొని తన గుండెలమీద పడేలాగ లాక్కొని ఆమె చెవిలో "ఇంతకూ నువ్వు నా చేతికి అందివ్వబోయేది అల్లరి అబ్బాయినా? అందాల పాపాయినా?" అన్నాడు.

సరోజినికి జరుగుతున్నది కలో నిజమో అర్థంకాలేదు. ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ నిండిన కళ్ళతో భర్త కళ్ళలోకి చూసింది.

కలిసిన ఆజంట కనులలో విరిసిన శరత్కాంతులలో వెనుకటి ముసురు చెదిరిపోయింది.